క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బ్రహ్మకుమారీ బ్రదర్స్



వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న లోకేష్, శాంతారావు

నరసన్నపేట: మండల కేంద్రానికి చెందిన బ్రహ్మకుమారీ బ్రదర్స్ లోకేష్, శాంతారావు సోమవారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును నెల్లూరులో కలిశారు. బ్రహ్మకుమారీస్ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వెంకయ్యనాయుడు అభినందించారని శాంతారావు తెలిపారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని వెంకయ్యనాయుడు సూచించారన్నారు.

నేత్ర చికిత్సలకు 32 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నరసన్నపేట: మండలంలోని మడపాం హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 32 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మడపాం పంచాయతీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 68 మందికి కంటి తనిఖీ చేసినట్లు ప్రభుత్వ పారామెడికల్ కంటి వైద్య సహాయకులు బాలగంగాధరరాజు తెలిపారు. రోగులను ఆపరేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ శివప్రసాద్, క్యాంప్ కోఆర్డినేటర్ టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

56 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యుడు రాహుల్ 56 మంది రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ సుజాత

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామంలో ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు సోమవారం మూడు నెలలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేశారు. రైస్ బ్యాగ్, రాగిపిండి, ఆయిల్, పప్పులను పొందూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మెట్ట సుజాత అందజేశారు. ఉపహార్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న సుందరరావు

కొత్తూరు: పేదలకు సేవలు అందజేస్తున్న భగత్ సింగ్ ట్రస్టుకు కొత్తూరు మండలం ఓండ్రుజోలకు చెందిన బామిడి రాజు రూ.50 వేల విరాళాన్ని సమకూర్చారు. ఈ మొత్తాన్ని దాత రాజు తరఫున తన చిన్నాన్న సుందరరావు ట్రస్టు సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ మొత్తం ఫ్రీజర్ బాక్స్ కొనుగోలు చేసేందుకు ఉపయోగించాలన్నారు. ట్రస్టు సభ్యులు, సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై గ్రామ సభలు



మాట్లాడుతున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: మండలంలోని లక్కుపురం, సింగన్నపాలెం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపైన, పింఛన్లపైన సామాజిక తనిఖీ గ్రామసభలు సోమవారం నిర్వహించారు. లక్కుపురం గ్రామసభ ఎంపీపీ కర్నేన దీప, సర్పంచ్ వియ్యపు విజయలక్ష్మి, డీఆర్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు జరిగిన ఉపాధి పనులు, వివిధ రకాల పింఛన్ల వివరాలు తెలిజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ భారతి, మేట్లు పాల్గొన్నారు.

వైద్య వృత్తి గొప్పది



నరసన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ జయశ్రీ

- ఘనంగా డాక్టర్స్ డే
- వైద్యులకు సత్కారం

నరసన్నపేట: డాక్టర్స్ దినోత్సవం నరసన్నపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సత్కార కార్యక్రమాలు చేపట్టారు. వైద్యుడు గొలివి మోహన్‌రావు, మెండ పద్మావతి, చల్ల కృషి, అనిల్, సూరపు కృష్ణారావును సత్కరించారు. వైద్య సేవలు మరింత బాధ్యతగా నిర్వహించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సదాశివుని కృష్ణ, కె.సాయిరాం, ఊణ్న రంగనాథ్, పీ. రమేష్, తూముల శ్రీను, బోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో..

నరసన్నపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్సు డేను సందడిగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: వైద్యులు ప్రాణాలు కాపాడే దైవాలని సైన్స్ ఉపాధ్యాయుడు నల్ల తారకరామారావు అన్నారు. సోమవారం పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాలు గీతాంజలి పండా విద్యార్థులతో నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వైద్య వృత్తిని ఎంచుకుని సమాజానికి సేవ చేయాలన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రమణి, కోటి పాల్గొన్నారు.



పాతపట్నం: మాట్లాడుతున్న తారకరామారావు



నరసన్నపేట: గొలివి మోహన్‌రావును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

డెంగీపై అప్రమత్తం



నరసన్నపేట: ఉర్లాంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నరసన్నపేట: వర్షా కాలంలో డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు సుజాత అన్నారు. ఉర్లాం పీహెచ్‌సీ ఆవరణలో స్టాప్ డయేరియాలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాలు నొప్పి, వికారం, దద్దుర్లు, అలసట వంటి కనిపిస్తే డెంగీ లక్షణాలుగా గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యులు అరవింద్, సిబ్బంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: బూర్జ పీహెచ్‌సీ వైద్యులు జి.రాజశేఖర్, ఐ.పావని, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యులు పి.రోజ, ఎ.రమ్య ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వర్షాలు పడుతున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డైయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లతోనే డయేరియా వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చునని తాడివలస పీహెచ్‌సీ వైద్యులు రమేష్‌నాయుడు, నవీన్ అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. పొందూరులో తాడివలస పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బూర్జ: పోస్టర్లు ప్రదర్శిస్తున్న బూర్జ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

సారవకోట: మండలంలోని అంగూరు సచివాయం పరిధిలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీని సారవకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వహించారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వ్యాపి చెందుతాయన్నారు. ఎంపీడీఓ రాంబాబు, వైద్యులు సౌమ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సారవకోట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పొందూరు: అవగాహన కల్పిస్తున్న తాడివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

పరామర్శ..

జలుమూరు: మండలంలోని సుబ్రహ్మణ్యపురం గ్రామానికి చెందిన కూన లక్ష్మణరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. రావిపాడు గ్రామానికి చెందిన గొండు ఎర్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కృష్ణదాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, నాయకులు బోర సింహాచలం, కె.హరిప్రసాద్, కె.దామోదరరావు తదితరులు ఉన్నారు.



రావిపాడులో ఎర్రయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణదాస్, నాయకులు

పెద్దసరియాపల్లిలో హోమియో వైద్య శిబిరం

పాతపట్నం: మండలంలోని పెద్దసరియాపల్లి గ్రామంలో సర్పంచ్ రొణంకి స్వాతి ఆధ్వర్యంలో సోమవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యురాలు ఎస్.ఉమాగౌరి 143 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డి.దివ్యరెడ్డి, జి.అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు ఉమాగౌరి

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

జలుమూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన జలుమూరు మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంపై సుమారు 80 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, వైద్య, విద్య, విద్యుత్ శాఖలపై చర్చించారు. ఎమ్మెల్యేను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మెండ విజయశాంతి, తహసీల్దార్ నాగమ్మ, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, జోల నాగరత్నం, వ్యవసాయశాఖ అధికారి కె.సురేష్, పశుసంవర్ధక శాఖ వైద్యులు పట్ట సంతోష్ కుమార్, వైద్యుడు తాడేల శ్రీకాంత్, ఎంఈఓ మాధవరావు, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాలరాయొద్దు



మాట్లాడుతున్న రామారావు

సరుబుజ్జిలి: పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులను టీడీపీ ప్రభుత్వం విస్మరించడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆమదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ల సేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చి.. పింఛన్ల సొమ్మును సచివాలయం ఉద్యోగులతో పంపిణీ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను కాదని టీడీపీ కార్యకర్తలతో పింఛన్లు అందించడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే పద్ధతి కొనసాగితే అధికారులు.. న్యాయ స్థానల్లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదులు చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని ఎంఈఓలు పీవీ రామరాజు, పి.రాజారావు అన్నారు. పొందూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడికి పోదాం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు..!

ఎల్.ఎన్.పేట: నిబంధనలు పాటించని ముగ్గురు ఉద్యోగులకు స్థానిక తహసీల్దార్ షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని యంబరాంలో సోమవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో ఉన్న వ్యాన్‌తో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వ్యాన్ ఆపరేటర్ చేపట్టారు. పెన్షన్ల పంపిణీ చేసేందుకు గ్రామానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వచ్చారు. వ్యాన్‌పై మాజీ సీఎం ఫొటో ఉండటాన్ని గుర్తించారు. వెంటనే తహసీల్దార్‌ను వ్యాన్ వద్దకు పిలిపించారు. మాజీ సీఎం బొమ్మ ఉంటే ఎలా బియ్యం పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. పరిస్థితిని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫోన్ ద్వారా వివరించారు. మంత్రి స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడారు. దీనిపై వెంటనే తహసీల్దారు స్పందించారు. వ్యాన్ ఆపరేటర్, రేషన్ డీలర్, వీఆర్వోకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. విచారణ జరిపించి నిర్లక్ష్యంగా ఉన్న వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు.

నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాతపట్నం: మండల కేంద్రంలోని మహేంద్ర తనయ నదీ తీరాన ఉన్న అతి పురాతన దేవాలయంలో గల నీలకంఠేశ్వరుడుకి సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వరుడు గంగలోనే భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయాన్నే స్వామివారికి ప్రధాన అర్చకులు పార్వతీశం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు శివుడుని దర్శించుకున్నారు.



గంగలో దర్శనమిచ్చిన నీలకంఠేశ్వరుడు

పింఛన్ల పంపిణీ



నరసన్నపేట: బొరిగివలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జేసీ నవీన్



బూర్జ: అన్నంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



పాతపట్నం: పాతపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో సోమవారం అధికారులు, ఎమ్మెల్యేలు పింఛన్లు పంపిణీ చేశారు. పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, మెళియాపుట్టి మండలాల్లోని పలు గ్రామాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. నరసన్నపేట, జలుమూరు, సావరకోట, పోలాకి మండలాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: లింగాలవలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గ్రామ సభలు బాధ్యతగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

నరసన్నపేట: రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధమైన గ్రామ సభలు విధిగా పంచాయతీల్లో చేపట్టాలని నరసన్నపేట ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. నరసన్నపేటలో సోమవారం గ్రామ సభను సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జనవరి 26, ఏప్రిల్ 14, జులై 1, అక్టోబర్ 2వ తేదీల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. గ్రామ సభలకు ప్రజలు హాజరుకావాలన్నారు. సమస్యలు తెలియజేస్తూ.. అభివృద్ధి పనుల కోసం చర్చించాలన్నారు. సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు మాట్లాడుతూ సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈఓ చిన్నారావు, వార్డు సభ్యులు గుప్త, కృష్ణప్రసాద్, ఆర్.శ్రీధర్, బీఎల్ శర్మ, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, హౌసింగ్ ఏఈ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

కొత్తూరు: స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన రాజశేఖర్ పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు బదిలీ అయ్యారు. పలువురు రైస్ మిల్లర్ల యజమానులు సోమవారం రాజశేఖర్‌ను సన్మానించారు. రైస్ మిల్లులు, జీడితోపాటు పలు పరిశ్రమల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఇదే బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసిన చుక్కా నరేష్ దొర వీరఘట్టానికి బదిలీపై వెళ్లారు.

నూతన మేనేజర్‌గా అశోక్‌కుమార్..

కొత్తూరు యూనియన్ బ్యాంక్ నూతన మేనేజర్‌గా అశోక్ కుమార్ నియామకమయ్యారు. ఇంతవరకు అశోక్‌కుమార్ శ్రీకాకుళంలో రీజనల్ మేనేజర్‌గా పని చేశారు.



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు, మిల్లర్లు

విద్యాభివృద్ధికి మరింత కృషి చేయండి

ఆమదాలవలస: నియోజకవర్గ కేంద్రంలోని కేజీబీవీ, జ్యోతిరావు పూలే, మోడల్ స్కూల్ ద్వారా విద్యాభివృద్ధికి అధికారులు మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయా పాఠశాలలకు చెందిన అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వివిధ విభాగాలలో ఉన్న విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే నియోజవర్గంలో ఉన్న ఈ మూడు పాఠశాలల అభివృద్ధిలో భాగంగా పక్కా భవన నిర్మాణాలు చేపట్టడానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. విద్యారంగంలో పనిచేస్తున్న ఏ అధికారులైనా, ఉపాధ్యాయులైనా సక్రమంగా పనిచేయకుంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

కళలను ఆదరించాలి

శ్రీకాకుళం కల్చరల్: కళలను ప్రతిఒక్కరూ ఆదరించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, బాలు, జి.ఆనంద్(జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు సోమవారం జరిగాయి. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని బాలు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం గాయకులను సత్కరించారు. కళామందిర్‌లో ఆనంద్ విగ్రహం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, పులఖండం శ్రీనివాసరావు, బలివాడ మల్లేశ్వరరావు, కె.దుర్గాశ్రీనివాస్, వైకుంఠరావు, కె.ఎల్.ఎన్.మూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, శ్రీనివాసరావు, డాక్టర్ సంపత్ కుమార్, సురంగి మోహనరావు పాల్గొన్నారు.

అలరించిన స్వరమాధురి

జి.బి.ఎ. స్వరమాధురి ఆధ్వర్యంలో బండారు చిట్టిబాబు, బండారు రమణమూర్తి సంగీత సారథ్యంలో గాయకులు మూర్తి, నిక్కు అప్పన్న, కల్యాణం రామ్మోహన్‌రావు, నివాస్, మంగవేణి, సతీష్, రాజమహంతి రాజమోహన్‌లు చక్కనైన సినీ గీతాలను ఆలపించారు.